RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 170 | మే 31, 2025 | వెల : రూ.3-00



కేంద్ర ప్రభుత్వం పథకాలకు రైతు గుర్తింపు కార్డు

4లో..




# వనం వీడి జనంలోకి..!

- ఈ ఏడాది జనజీవన స్రవంతిలోకి 282 మంది మావోయిస్టులు
- తాజాగా కొత్తగూడెంలో 17 మంది..
- ఎస్పీ రోహిత్ రాజు వెల్లడి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి:**

కొత్తగూడెంలో 17 మంది మావోయిస్టులు జిల్లా పోలీసులు, సీఆర్పీఎఫ్ అధికారుల సమక్షంలో లొంగిపోయారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్‌లో శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడారు. లొంగిపోయిన వారిలో ఏసీఎం క్యాడర్‌కు చెందిన ఇద్దరు, పార్టీ సభ్యులు నలుగురు, మిలీషియా సభ్యులు 11 మంది ఉన్నట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంత వాసుల్లో మావోయిస్టు సిద్ధాంతాలపై నమ్మకం సన్నగిల్లిందన్నారు. తెలంగాణలో మావోయిస్టులకు ఆశ్రయం ఉండే పరిస్థితులు లేవని అన్నారు. విశ్వసనీయ సమాచారంతో ఇటీవల జిల్లాలో 20 మంది సాయుధ దళ సభ్యులను అరెస్టు చేసి 12 ఆయుధాలను జప్తు చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 282 మంది మావోయిస్టు దళ సభ్యులు లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసి తగిన పునరావాస సౌకర్యాలను పొందినట్లు ఎస్పీ రోహిత్ రాజు వెల్లడించారు.






## జాతీయ జెండాపై నిర్లక్ష్యం

- చినిగిన మువ్వన్నెల పతాకం
- పట్టించుకునే వారేరి?
- త్రివర్ణ పతాకం పట్ల నిర్లక్ష్యం సరి కాదని జనం ఆగ్రహం

**వేద న్యూస్, వరంగల్ :**

గ్రేటర్ వరంగల్ రైల్వే స్టేషన్ ముందు భారీ ఎత్తున ఉండే జాతీయ జెండా చినిగి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గత కొన్ని రోజులుగా త్రివర్ణ పతాకం చినిగిపోయి అలాగే ఉందని పలువురు వెల్లడిస్తున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ సుందరీకారణలో భాగంగా స్టేషన్‌ను అందంగా తీర్చిదిద్దిన అధికారులు, ప్రజాప్రతినిధులు.. జాతీయ జెండా విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ ముందు చినిగిన జాతీయ జెండాను తొలగించి వెంటనే నూతన జాతీయ జెండాను ఎగరవేయాలని పలువురు కోరుతున్నారు. పౌరులందరిలో నిరంతరం జాతీయ భక్తిని పెంపొందిస్తూ.. భారతీయులందరూ ఆత్మ గౌరవ ప్రతీకగా నిలిచే జాతీయ పతాకం పట్ల నిర్లక్ష్యం ఏ మాత్రం సరికాదని ప్రజలు ధర్మాగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




## 'మిల్స్ కాలనీ' సీఐ కుర్చీ ఖాళీ

- పీఎస్ పరిధిలో ఫిర్యాదులు పెండింగ్ లో పడే చాన్స్
- త్వరగా ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని జనం వేడుకోలు

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలలో మొదటి వరుసలో ఉండే ఏ.జే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ సీఐ కుర్చీ ఖాళీ అయ్యి 10 రోజులు అవుతోంది. ఇప్పటికీ కొత్త సీఐని నియమించలేదు. ఈ స్టేషన్ పరిధిలో చిన్న సమస్య తలెత్తినా చిలికి చిలికి గాలివానగా మారుతుంది. చాలా కాంప్లికేటెడ్ పోలీస్ స్టేషన్ గా సైతం ఈ పీఎస్ కి పేరు ఉంది. గతంలో సీఐగా పనిచేసిన వెంకటరత్నంపై పలు ఆరోపణలు రాగా, విచారణ చేపట్టిన అధికారులు ఆరోపణలు రుజువు కావడంతో ఈ నెల 20న సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి నుంచి ఏ.జే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ సీఐ కుర్చీ ఖాళీగా ఉంది. పది రోజులు గడుస్తున్నప్పటికీ నూతనంగా సీఐను నియమించలేదు. దీంతో

నూతన సీఐని త్వరగా నియమించాలని పలువురు కోరుతున్నారు. సీఐ పోస్టు ఇలా మరికొన్ని రోజులు ఖాళీగానే కొనసాగితే.. పీఎస్ లో ఫిర్యాదులు కొన్ని పెండింగ్ లో పడే ఛాన్స్ ఉంటుందని, అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కొంత దిశా నిర్దేశం సరిగా ఉండకపోవచ్చు అనే అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. ఇన్ స్పెక్టర్ పోస్టును మరో అధికారితో పోలీసు ఉన్నతాధికారులు భర్తీ చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అడిషనల్ డీసీపీగా భాధ్యతలు చేపట్టిన రాయల ప్రభాకర్ రావు

4లో..

## రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నాం..

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**





రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని రాష్ట్ర అటవీ దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని 19 డివిజన్ వివేకానంద కాలనీలో 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులతో పాటు 41 వ డివిజన్ లో ఎస్ డిఎఫ్ నిధులు రూ.34 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నేడు శంకుస్థాపన నిర్వహించిన పనులతో పాటు ఇంకా శంకుస్థాపన నిర్వహించాల్సిన పనులు చాలా ఉన్నాయని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతనే మళ్లీ కొత్త రోడ్లు వేయడం జరుగుతుందని నియోజకవర్గంలో ఎక్కడ ఏ సమస్య ఉన్న మేయర్, జిల్లా కలెక్టర్, కమిషనర్ లు వెంటనే స్పందించి సహకారం అందిస్తున్నారని అన్నారు. గతంలో ముఖ్యమంత్రి రూ.10 కోట్ల ఎస్ డి ఎఫ్ ఫండ్ అందించారని గుర్తు చేసిన మంత్రి మరో 5 కోట్ల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారని వచ్చే నిధులను అభివృద్ధి పనుల కోసం వినియోగిస్తామని తెలిపారు. వెల్ఫేర్ ఆక్టివిటీస్‌లో భాగంగా మహిళలకు రైతులకు వేర్వేరుగా అనేక రకాల అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందని యువత కోసం రాజీవ్ యువ వికాసం అనే కొత్త పథకాన్ని తీసుకురావడం జరిగిందని సన్న బియ్యం పథకాన్ని కూడా తీసుకురావడం జరిగిందని వెల్లడించారు. అభివృద్ధి విద్య, వైద్యం సంక్షేమాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణ ను ముందుకు తీసుకు వెళ్లడానికి కృషి చేస్తున్నారని ముఖ్యమంత్రితో పాటుగా క్యాబినెట్ మంత్రులుగా ఉన్న తాము స్థానికంగా ఉన్న నాయకులు ప్రజాప్రతినిధులు కృషి చేస్తూ ప్రజలకు అనుకూలంగా పనులు జరిగే విధంగా సహకరిస్తున్నారని తెలిపారు. జూన్ 6వ తేదీన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్ కూడా రాబోతున్నాయని అనంతరం ఆ కార్యక్రమాన్ని నిర్విరామగా కొనసాగించడం జరుగుతుందని ఇళ్ళు లేని నిరుపేదలకు ఇండ్లు ఇవ్వడానికి ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బల్దియా ఇన్చార్జ్ ఎస్ఇ శ్రీనివాస్, తాసిల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

- ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**



ఉద్యోగ ఉపాధ్యాయులు పెన్షనర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయమని ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పిఆర్టియుటిఎస్ సూర్యాపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీ ఐ కేర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉద్యోగస్తులకు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉద్యోగస్తులకు హెల్త్ కార్డుల ద్వారా ఉచిత కంటి వైద్యం, సర్జరీలు చేయడం జరుగుతుందన్నారు. ఇట్టి అవకాశాన్ని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు వినియోగించుకోవాలని కోరారు. రాబోయే కాలంలో మరింత సౌకర్యవంతమైన క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు ఇప్పించేందుకు ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయి అన్నారు. ఉద్యోగస్తుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఐ కేర్ హాస్పిటల్ డాక్టర్ ఊట్కూరి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి నల్గొండ జిల్లాలో హెల్త్ కార్డు ద్వారా ఉద్యోగస్తులకు జర్నలిస్టులకు తమ ఆసుపత్రిలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి సర్జరీలు కూడా చేయడం జరుగుతుందన్నారు. అన్ని పని దినాలలో తమ వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. పి ఆర్ టి యు టి ఎస్ సూర్యాపేట జిల్లా శాఖ అధ్యక్షులు తంగెళ్ల జితేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆత్మకూర్ ఎస్, జాజిరెడ్డిగూడెం మండల విద్యాధికారులు

మిగతా 4వ పేజీలో..

# సాహితీ వేత్త పెద్దిరెడ్డి గణేష్ కు ఎన్టీఆర్ స్మారక అవార్డ్

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**



విజయవాడ కు చెందిన ప్రముఖ ఎక్స్ రే సాంస్కృతిక సంస్థ ప్రతి ఏటా స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి పురస్కరించుకుని స్మారక అవార్డులను ప్రకటిస్తుంది. ఈ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ రంగాలలో ప్రముఖులైన వారిని ఈ అవార్డుకు ఎంపిక చేసింది. మనం వికాస వేదిక స్థాపించి,గత మూడు దశాబ్దాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో సాహితీ ,సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించిన సూర్యాపేట కు చెందిన పెద్దిరెడ్డి గణేష్ ను ఈ అవార్డ్ వరించింది. నేడు 31 శనివారం సాయంత్రం విజయవాడ సిద్దార్థ కళాశాల ఆడిటోరియం లో ఈ అవార్డ్ ప్రధానం జరగనున్నది.ఇదే వేదిక పై ప్రముఖ నటులు నట కిరీటి రాజేంద్ర ప్రసాద్ కు ఎన్టీఆర్ విశిష్ట పురస్కారాన్ని ఇవ్వనున్నారు.పెద్దిరెడ్డి గణేష్ కు ఈ అవార్డ్ రావటంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న సాహితీ ప్రియులు సంతోషం వ్యక్త పరిచి శుభాకాంక్షలు తెలిపారు.

# అంగన్వాడీ టీచర్ పదవి విరమణ

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**



గత 26 సంవత్సరాలుగా ఐసిడిఎస్ అంగన్వాడి టీచర్ గా విధులు నిర్వహించిన సరోజినీ శుక్రవారం పదవి విరమణ చేశారు.శుక్రవారం చివ్వెంల మండలం దురాజ్ పల్లి సెక్టార్ కుడకుడ అంగన్వాడి సెంటర్ 1 లో ఆమెను తోటి అంగన్వాడీ టీచర్లు ఘనంగా సన్మానించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన పలువురు ప్రముఖులు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వహించే ఉద్యోగులకు ఉద్యోగ పదవి విరమణ సహజమని అన్నారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ శ్రీవాణి,ఏసిడిపిఓలు సాయిగీత,సూపర్వైజర్లు సునీత,శ్రీదేవి,దురాజ్ పల్లి సెక్టర్ అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు తీవ్ర నిరాశని మిగిల్చాయి

## -కట్టెబోయిన అనిల్ కుమార్

**వేద న్యూస్,నాగార్జునసాగర్/మిర్యాలగూడ:**

ఇటీవల కేంద్ర ప్రభుత్వం 2025 -26 వానకాలం సీజన్ కు 14 పంటలకు ప్రకటించిన కనీస మద్దతు ధరలు తెలంగాణ అన్నదాత కి తీవ్ర నిరాశని మిగిల్చాయి అని ఏ.కే ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టెబోయిన అనిల్ కుమార్ ఆరోపించారు. హాలియా పట్టణం లో ఏ.కే ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టెబోయిన అనిల్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా పంటలకు ఎక్కువ మొత్తం లో మద్దతు ధరలు లభిస్తాయి అని ఆశపడిన రైతన్న ఆశలు అడి ఆశాలు అయ్యాయి అని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్టంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకి అండగా జాతీయ వ్యవసాయ ఖర్చుల,ధరల కమిషన్ కి సిఫారస్సు చేసినా కనీస మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించలేదన్నారు. తెలంగాణ రాష్టంలోని రేవంత్ రెడ్డి సారద్యం లోని కాంగ్రెస్ ప్రభుత్వం వరి కి రూ.3000, పత్తి కి రూ.8,121లు,మొక్క జొన్న కి రూ. 2,900 లు,వేరుశేనగకి రూ. 8,000లు,కందులకి రూ. 9,200లు ఇలా అన్ని పంటలకి కనీస మద్దతు ధరలను సిపార్సు చేసినది.కాని కేంద్ర ప్రభుత్వం వాటిని ఏమి పట్టించుకోకుండా కేవలం వరికి మద్దతు ధరను రూ.69 పెంచి రూ.2,369 చేసినది అని అన్ని పంటలపైన నామామాత్రపు ధరలను ప్రకటించి మరొకసారి వ్యవసాయ రంగంపైన కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని విధానాని చాటి చెప్పింది అని పేర్కొన్నారు. వ్యవసాయ రంగం మరియు వాటి అనుబంధ రంగాలని నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ వ్యవస్థలకి అప్పాజెప్పాలని చూస్తుంది అని దీనిని ప్రతి ఒక్కరూ గమనించలని అదే విధంగా మరొకసారి కేంద్ర ప్రభుత్వం పంటల కనీస మద్దతు ధరలను పరిశీలన చేసి రైతులకి మేలు చేసే విధంగా ధరలు ప్రకటించాలని ప్రస్తుతం వ్యవసాయ ఖర్చులు చాలా పెరిగాయి అని



కూలీలు,విత్తనాలు,యంత్రాలు,పురుగుల మందులు,ఎరువుల పెట్టుబడి ప్రతి యెడు 15-20 శాతం ఖర్చులు పెరుగుతున్నాయి. కావున రైతులకి మేలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ పాలసీలు ఉండాలని డిమాండ్ చేశారు.

# వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలి



## - నగర మేయర్ గుండు సుధారాణి

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

ప్రభుత్వ ఆదేశానుసారం బల్దియా ద్వారా రూపొందించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శుక్రవారం బల్దియాలోని మేయర్ ఛాంబర్ లో వందరోజుల ప్రణాళిక అమలు చేయు తీరుపై మేయర్ అధికారులతో సమీక్షించి సమర్థవంతంగా అమలు పరచుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జూన్ రెండవ తేదీ నుండి సెప్టెంబర్ 9వ తేదీ వరకు బల్దియా ద్వారా 100 రోజులపాటు చేపట్టే కార్యక్రమాల గురించి వివరిస్తూ బల్దియా వ్యాప్తంగా పచ్చదనం పరిఢవిల్లేలా 100 రోజుల కార్యక్రమంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, వర్షాకాలంలో నగరం ముంపు నివారణ చర్యలు భాగంగా గ్రేటర్ వరంగల్ లోని 36 ప్రధాన నాలాల్లో 121 లక్షల రూపాయల వ్యయంతో కొనసాగుతున్న పూడికతీత పనులను పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రచారం నిమిత్తం గోడలపై రాతలను మ్యూరల్ పెయింటింగ్ లను వెయ్యడం ప్రదేశాలు గుర్తించాలని, వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యల్లో భాగంగా నాలాలలో ఉన్న బ్లాకే జ్ ప్రాంతాలను గుర్తించి మెష్ లు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో రెండు జంక్షన్ లను అభివృద్ధి సుందరీకరణ చేయాలని, హనుమకొండ లోని బాలసముద్రం, వరంగల్ లో ఒక్కొక్కటి చొప్పున రెండు పార్కులను అభివృద్ధి చేయాలని, రహదారుల మరమ్మత్తులు ఏర్పడే గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చాలని, పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించి ఎలాంటి ప్రాణం నష్టం ప్రజలకు జరగకుండా చర్యలు తీసుకుంటూ, నోటీసులు జారీ చేసి శిథిలావస్థ నిర్మాణాలను తొలగించాలని అన్నారు. ఆరేళ్ల ద్వారా భువన్ సర్వే నిర్వహించాలని, డిఆర్ఎఫ్ సిబ్బంది తగినంత ఎక్విప్మెంట్, డి వాటరింగ్ పంప్స్, బోట్ లతో సిద్ధంగా ఉండాలని, పారిశుద్ధ్యం ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తూ అంతర్గత మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు.అన్ని మంచినీటి వనరులను పరిశుభ్రం చేయాలని, జి డబ్లుఎంసి లోని 125 ఈఎస్ఎల్ఆర్ లను, వాటర్ ట్రీట్మెంట్ క్రమం తప్పకుండా శుభ్రం చేయడంతో పాటు క్లోరినేషన్ లెవెల్స్ పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోన, సిఎంహెచ్ఓ రాజిరెడ్డి, ఇన్చార్జి ఎస్ ఈ శ్రీనివాస్, ఇంచార్జ్ సిపి రవీందర్ రాడేకర్, ఉప కమిషనర్ ప్రసన్నారాణి, డిఎఫ్ శంకర్ లింగం డీఈలు,ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# యువత మత్తు మహమ్మారి వలలో పడొద్దు

**వేద న్యూస్, మహబూబాబాద్ :**

యువత వారి భవిష్యత్తు మరియు దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మత్తు మహమ్మారి వలలో పడొద్దు అని, జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల పై ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ చేపట్టనున్న కార్యక్రమం అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారి గణేష్ పేర్కొన్నారు.శనివారం నాడు కలెక్టరేట్లో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న మాదకద్రవ్యాలు, గుట్కా వ్యతిరేక కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ తో కలిసి ఆవిష్కరించి జిల్లా వ్యాప్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు బానిసలై భౌతికంగా మానసికంగా క్షీణించి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, ఇది ఒక సామాజిక సమస్యగా దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల బానిసత్వంతో నేర ప్రవృత్తి పెరిగిపోవడంతో పాటు, చదువు ఉద్యోగం లాంటి లక్ష్యాలకు దూరమవుతున్నారని, మాదకద్రవ్యాల నిలువ, సరఫరా, రవాణా ప్రక్రియలో ఎవరైతే భాగస్వాములు అవుతారో వారికి కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. మాదకద్రవ్యాలు మత్తుపదార్థాల వ్యతిరేక సదస్సుల నిర్వహణలో ప్రభుత్వ సహకారం తప్పనిసరిగా ఉంటుందని మన జిల్లాను డ్రగ్స్ మరియు గుట్కారహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని అన్నారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ ఆంధ్ర ఒరిస్సా బార్డర్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ద్వారా డ్రగ్స్,గుట్కా, గంజాయి జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయని, సంబంధిత శాఖలు మరింత నిఘా పెంచాల్సిన అవసరం ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతరం ప్రత్యేక




నిఘా ఉంచాలని, డ్రగ్స్ లో ఉండే కెఫిన్ అనే పదార్థం ఆరు సెకండ్లలో బ్రెయిన్ లోని రక్తప్రసరణ కందుతుందని తద్వారా యువత ఒక రకమైన ఫాల్స్ భ్రాంతికి గురై ,పదేపదే అదే రకమైన అనుభవాలను కావాలని కోరుతూ, బానిసలుగా మారతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ , ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ తదితరులు పాల్గొన్నారు.

# పౌర హక్కులపై అవగాహన అవసరం




**వేద న్యూస్, వరంగల్ :**

గీసుగొండ మండలం 15 వ డివిజన్ గొర్రెకుంటలో పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ మరియు విజిలెన్స్ కమిటీ సభ్యులు నమిండ్ల చిన్నస్వామి హాజరై ప్రసంగించారు. ప్రతి నెల 30వ తారీఖు జరిగే పౌర హక్కుల దినోత్సవం సద్వినియోగం చేసుకోవాలని గ్రామంలో ఉన్న సమస్యలను మరియు సంక్షేమ పథకాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న గీసుకొండ మండలం ప్రభుత్వ అధికారులు ఆర్ ఐ శ్రీధర్, ఎస్సై ప్రశాంత్ బాబు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు,మద్యానికి బానిసై చెడు మార్గంలో వెళ్లకుండా యువత ముందుండాలని పోలీసు వారికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆబ్కారీ పరకాల ఎస్ఐ జ్యోతి ,మెడికల్ ఆఫీసర్ కె. అరుణ్ కుమార్, బల్దియా కాశీబుగ్గ సర్కిల్ ఆర్ ఓ శ్రీనివాస్, ఆర్ఐ సునీల్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ బందెల, నమిండ్ల క్లెమెంట్, సిలువేరు రవి, ల్యదేళ్ళ సంపత్, ఎలగొండ ప్రవీణ్, జన్ను నర్సయ్య తదితరులు పాల్గొన్నారు

# రాహుల్ గాంధీని విమర్శిస్తే చూస్తూ ఊరుకోం



**వేద న్యూస్, హైదరాబాద్:**

బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావుపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై రఘునందన్ రావు పరిధి దాటి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఇవాళ(శుక్రవారం) గాంధీభవన్‌లో మీడియాతో జగ్గారెడ్డి మాట్లాడారు. ఏది పడితే అది మాట్లాడవద్దని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మొట్టికాయలు వేస్తే.. రాహుల్ గాంధీ గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. రాహుల్ గాంధీని విమర్శిస్తే తాము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు జగ్గారెడ్డి. కాంగ్రెస్ చరిత్ర గురించి రఘునందన్‌కి ఏం తెలుసని జగ్గారెడ్డి ప్రశ్నించారు. 544 సంస్థానాలను దేశంలో విలీనం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దని గుర్తుచేశారు. రఘునందన్ ఇంకోసారి రాహుల్ గాంధీ గురించి మాట్లాడితే తమ ప్రతాపం చూపిస్తామని హెచ్చరించారు. బీజేపీ నేతలు చిల్లరగా మాట్లాడితే తాను ఊరుకోనని వార్నింగ్ ఇచ్చారు. పీఏసీ కమిటీలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అవకాశం ఇచ్చి ఉంటే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. తనకి ఏ కమిటీలో అవకాశం ఇచ్చినా సంతోషమేనని తెలిపారు. గాంధీ భవన్‌లో ఏ చిన్నపదవి ఇచ్చినా చేస్తానని స్పష్టం చేశారు. సీనియర్లకు అడ్వైజరీ కమిటీలో చోటు కల్పించడం మంచి పరిణామమని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# సంపాదకీయం

## జి.ఒ నెం. 3ను పునరుద్ధరించాలి

ఆదివాసీ సమాజాన్ని, ఆదివాసీ అస్తిత్వాన్ని, ఆదివాసీ ఆత్మగౌరవాన్ని అంతం చేసేందుకు ఏజెన్సీలోకి వలసవాదులు, గిరిజనేతరులు క్రమక్రమంగా ఏజెన్సీ హక్కులు, చట్టాలను కాలరాస్తూ అన్ని విధాలుగా కొల్లగొడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులకు దక్కవలసిన ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సైతం ఆక్రమిస్తూ ఆదివాసుల నోటి దగ్గర ఉన్న కూడు కూడా లాక్కుంటున్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఏజెన్సీ 5వ షెడ్యూల్ భూభాగంలో అడవి బిడ్డల హక్కులను, భూములను, రిజర్వేషన్లను దర్జాగా అనుభవిస్తున్నారు. ఏజెన్సీలో జి.ఒ నెం. 3 సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టును ఆశ్రయించి సామాజిక న్యాయాన్ని సమాధి చేశారు. ఆదివాసులు, అడవి బిడ్డలు నాగరికత సమాజానికి దూరంగా జీవిస్తూ అనుక్షణం దినదిన గండంగా తమ మనుగడ కోసం, అస్తిత్వం కోసం పోరాటం చేస్తున్న తరుణంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆనాటి ఆదివాసీల పోరాటాలను చూసి చలించిపోయి ఆదివాసీ ప్రాంతాల్లో ఆదివాసులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సంచలనాత్మక నిర్ణయం తీసుకున్నారు.

1986 సంవత్సరంలో జి.ఒ నెం. 275ను జారీ చేశారు. ఆదివాసీ, అడవి బిడ్డలకు 100% రిజర్వేషన్ అవకాశాన్ని కల్పిస్తూ మరో 18 జిఒలను కూడా జారీ చేశారు. నేటి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాలు, తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలలో ఏజెన్సీ టీచర్లు, విఆర్ఒ, విఆర్ఎ, ఎఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్లు, డిప్యూటీ సర్వేయర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఫారెస్ట్ ఆఫీసర్లు, పోలీస్ శాఖ, ఆశ్రమ పాఠశాల అసిస్టెంట్లు, వంట మనిషి, కమాటీ, వాచ్‌మెన్, స్వీపర్లు వివిధ ఉద్యోగాల్లో సుమారు 50 వేల మంది ఆనాటి ఆదివాసీ నిరుద్యోగ యువత ఉద్యోగాల ద్వారా లబ్ధి పొందారు. 1998వ సంవత్సరంలో జి.ఒ నెం. 275ను కొందరు వలసవాద గిరిజనేతరులు అక్రమంగా చట్టవిరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ కోర్టులో కేసు వేసి రద్దు చేయించారు. 1998లో గిరిజన సంక్షేమ పరిషత్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 275 జిఒను పునరుద్ధరించాలని ఆదివాసీ సమాజం ఉవ్వెత్తున ఉద్యమాలను ఉధృతం చేశారు.

ఆ ఉద్యమాలను చూసిన ఆదివాసులపై అభిమానంతో ఆనాటి జిల్లా కలెక్టర్ గిరిధర్ 275 జిఒ స్థానంలో మరో జిఒను రూపొందించాలని గిరిజన సంక్షేమ శాఖకు సిఫార్స్ చేశాడు. కలెక్టర్ సిఫారసులను పరిశీలించిన గిరిజన సంక్షేమ శాఖ 275 జిఒ స్థానంలోనే జి.ఒ నెం. 3ను 10- జనవరి- 2000 సంవత్సరం జారీ చేసింది. ఆదివాసీ సమాజంలో ఆదివాసులకు, ఆదివాసులచే విద్యని బోధించడం, నిరుద్యోగాన్ని తొలగించడం ముఖ్యఉద్దేశం. కానీ ఆచరణలో వలసవాదులైన లంబాడీలకే అత్యధిక ఉద్యోగాలు పొందిన చరిత్ర సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది. ఫలితంగా ఆదివాసీ సమాజంలో ఉపాధి, ఉద్యోగలు ఇక పగటి కలగానే మారే అవకాశం ఉంది. ఆదివాసులకు 100% ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉన్నప్పటికీ సగం చట్టవిరుద్ధంగా వలస వచ్చిన లంబాడీలు దోచుకున్నారు. ఏమాత్రం ఆదివాసులకు ఉపాధి, ఉద్యోగాలు వచ్చే అవకాశం లేకుండా పోయింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 343 (2) ప్రకారం వలసవాదులు, గిరిజనేతరులు ఏజెన్సీలో నివసించడానికి అవకాశం లేనప్పుడు అదే ఏజెన్సీలో ఉద్యోగాలు ఎలా చేస్తారో? ఆదివాసులకు ప్రస్తుతం పాలిస్తున్న రాజకీయ పార్టీలు, న్యాయస్థానాలు సమాధానం చెప్పాలి. సుప్రీం కోర్టు సమత జడ్జిమెంట్‌లో ఏజెన్సీలో కూడా ప్రభుత్వాన్ని గిరిజనేతరుడు గానే చూడాలని తీర్పు వెలువరించిన విషయం మర్చిపోయారా..? 2001న జి.ఒ నెం. 3 నీ సమర్థిస్తూ హైకోర్టు ఫుల్ బెంచ్ జడ్జిమెంట్ ఆదివాసులు కనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగింది. హైకోర్టు జడ్జిమెంట్‌ను సుప్రీం కోర్టులో గిరిజనేతరులైన బోడ వెంకటేశ్వర్లు, లీలా ప్రసాదులు సవాల్ చేశారు. 2002 సంవత్సరంలో జరిగిన సుప్రీం కోర్టు వాదనలు గిరిజనేతరులకు స్టే ఇచ్చుటకు నిరాకరించింది. సుప్రీం కోర్టులో కెవియట్ పిటిషన్ దాఖలాలు చేయడం వల్ల 2000 సంవత్సరం నుండి 2008 వరకు ఏజెన్సీ డీఎస్సీలను యధావిధిగా కొనసాగించారు. గడిచిన రెండు దశాబ్దాల కాలంలో ఉమ్మడి రాష్ట్రంలో 9 జిల్లాలలో సుమారు 2000 వేలకుపైగా ఆదివాసులు ఉపాధ్యాయులుగా నియామకాలు పొందారు.

అనంతరం వలసవాదులు, గిరిజనేతరులు కుట్రలు కుయుక్తాలతో జి.ఒ నెం. 3 ను సుప్రీంకోర్టులో సవాల్ చేస్తే సుప్రీం కోర్టు 22 ఏప్రిల్ 2020న రద్దు చేయడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆదివాసీ నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు అందనంత దూరంగా అడవులకు పరిమితం చేసింది. నాటి నుంచి నేటి వరకు ఆదివాసీ హక్కుల కోసం.. ఆత్మగౌరవం కోసం ఆదివాసీ ప్రజలు ఆగ్రహంతో అనేక ఉద్యమాలు పోరాటాలు కొనసాగిస్తూనే ఉన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్‌లో మా ఊర్లో మా రాజ్యం మా ఉద్యోగాలు మాకే కావాలి అంటూ ఆదివాసీ ఐక్య సంఘాల జెఎసి, ఆదివాసీ ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీల ఆధ్వర్యంలో మన్యంలో మరో పోరాటానికి సిద్ధమయ్యారు. బందులు, రాస్తా రోకోలు, నిరసనలు, రిలే నిరాహార దీక్షలు, రైల్ రోకోలతో ఉద్యమ ఆగ్రహ జ్వాలలు అలుముకున్నాయి. సాక్షాత్తు ఆంధ్రప్రదేశ్ సిఎం నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ ఏజెన్సీ ప్రాంతంలోని స్థానిక ఆదివాసులకే ఉద్యోగా అవకాశాలు కల్పిస్తామని గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అంతేకాదు సుప్రీం కోర్టు మార్గదర్శకాలను పాటిస్తూనే రద్దు అయిన జి.ఒ నం:3ను పునరుద్ధరించేందుకు చట్టపరమైన అడ్డంకులపై అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆదివాసీ ఆడబిడ్డ మంత్రి సీతక్క ఆదివాసీ బిడ్డగా చొరవ తీసుకొని తమ ఆదివాసీ బిడ్డల ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు అటు ప్రభుత్వం, ఇటు గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపి తెలంగాణలో జి.ఒ నెం. 3కు పునర్జీవం పొయ్యాలని ఆదివాసీ నిరుద్యోగ యువకులు, విద్యార్థులు, ఆదివాసీ సమాజం కోరుకుంటుంది.

# ట్రంప్‌కు షాక్.. టారిఫ్ పెంపును తక్షణం నిలిపివేస్తూ ఆదేశాలు

**వేద న్యూస్, డెస్క్:**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు వాణిజ్య న్యాయస్థానంలో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. పలు దేశాలపై ఆయన విధించిన సుంకాలు చట్టవిరుద్ధమైనవంటూ న్యాయస్థానం బుధవారం తీర్పు చెప్పింది. వాణిజ్య భాగస్వాములపై ఏకపక్షంగా దిగుమతి సుంకాలు విధించి అధికారాన్ని అతిక్రమించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. సుంకాల పెంపును తక్షణమే నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పది రోజులలో స్పందించాలంటూ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. న్యూయార్క్‌లోని అంతర్జాతీయ వాణిజ్య కోర్టు ఈ కీలక తీర్పు వెలువరించింది. ఇతర దేశాలతో వాణిజ్యాన్ని నియంత్రించడానికి అమెరికా రాజ్యాంగం ప్రతినిధి సభకు విస్తృత అధికారాలు కట్టబెట్టిందని, అయితే అధ్యక్షుడు తన అత్యవసర అధికారాలను ఉపయోగించి వాటిని తోసిపుచ్చలేరని తెలిపింది. సుంకాల విషయంలో అధ్యక్షుడు తన విశేషాధికారాన్ని ఉపయోగించుకోవడాన్ని చట్టం అనుమతించదని ముగ్గురు న్యాయమూర్తులతో ఏర్పడిన ప్యానల్ స్పష్టం చేసింది. దేశాధ్యక్షుడికి ఉన్న పరిజ్ఞానం, సమర్థతపై తామేమీ వ్యాఖ్యానించబో మని, అయితే చట్టం అనుమతించనందున వాటిని ఉపయోగించుకోవడాన్ని అనుమతించలేమని తెలిపింది. ఈ తీర్పు అమలులోకి వచ్చిన పక్షంలో.. వాణిజ్య భాగస్వాముల నుండి రాయితీలు పొందడా నికి సుంకాలు విధించాలన్న ట్రంప్ అంతర్జాతీయ వాణిజ్య వ్యూహం బెడిసికొడుతుంది. యూరోపియన్ యూనియన్, చైనా, ఇతర దేశాలతో జరుపుతున్న చర్చల ప్రక్రియపై అనిశ్చితి ఏర్పడుతుంది.



# మద్యం తాగిన తర్వాత మనిషి మృగంలా మారుతాడు

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



కూతురిపై తండ్రి అత్యాచారం కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కింది కోర్టులో దోషిగా తేలిన అతడికి శిక్ష ఖరారైంది. తనకు విధించిన శిక్షను రద్దు చేయాలని సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. మద్యం తాగిన తర్వాత మనిషి మృగంలా మారుతాడంటూ వ్యాఖ్యానించింది. ' ఒక ఏడేళ్ల చిన్నారికి అతడు ఇలాంటి పరిస్థితి కల్పించాడు. ఎవరూ కూడా తమ కుమార్తెలపై ఇలాంటి దారుణానికి పాల్పడరు. ఆ బాలికకు కన్న తండ్రిపై తప్పుడు సాక్షాలు చెప్పించాల్సిన అవసరం ఏమిటి ? ఆమె ఎంతో బాధను అనుభవించినట్లు అర్థమవుతోంది. మద్యం తాగిన తర్వాత మనిషి మృగంలా మారుతాడు. అతడికి బెయిల్ ఇవ్వకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. దోషిగా తేలిన అతడికి శిక్ష నుంచి మినహాయింపు ఎలా కల్పించాలి ' అని జస్టిస్ బీవీ నాగరత్న , జస్టిస్ సతీష్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. దోషి చేసిన అభ్యర్థనను తిరస్కరించింది. కార్డియాలజిస్ట్ అయిన ఒక వ్యక్తి భార్యతో విడిపోయి వారణాసిలో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో తన ఏడేళ్ల కుమార్తెపై అత్యాచారానికి పాల్పడి భార్యకు విషయం తెలియజేశాడు. కుమార్తెను తన వద్దకు తెచ్చుకున్న ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది.న 2018 నాటి ఈ సంఘటనలో నిందితుడిని న్యాయస్థానం దోషిగా తేల్చి శిక్ష విధించింది. దీనిపై సుప్రీంని ఆశ్రయించగా, అతడి పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది.

# జస్టిస్ యశ్వంత్ వర్మపై కేంద్రం అభిశంసన తీర్మానం!

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనను ఎదుర్కొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు ఆయనకు వ్యతిరేకంగా కేంద్రం ఈ తీర్మానాన్ని తీసుకురానున్నట్టు తెలుస్తున్నది. ఆయనను పదవి నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టేందుకు కేంద్రం సిద్ధమైనట్టుగా సమాచారం. వచ్చే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కేంద్రం జస్టిస్ వర్మకు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నదని తెలుస్తున్నది. ఈ కేసులో సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యులతో నియమించిన కమిటీ నివేదిక ఆధారంగానే ఆయనపై ఈ చర్యకు దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మార్చి 14న రాత్రి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో అగ్ని ప్రమాదం తర్వాత పెద్ద ఎత్తున నోట్ల కట్టలు కాలిన స్థితిలో కనిపించటం తీవ్ర కలకలం రేపిన విషయం విదితమే. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చలకు దారి తీసింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు స్పందించింది. అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా మార్చి 22న ఈ ఘటనపై ముగ్గురు న్యాయమూర్తులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించారు. ఈ కేసులో దర్యాప్తును ప్రారంభించిన కమిటీ%ూ% నగదు ఎక్కడి నుంచి వచ్చిందన్న విషయాన్ని తెలపటంలో జస్టిస్ వర్మ విఫలమయ్యారని తేల్చింది. ఈ ఘటనపై విచారణ జరిపిన కమిటీ జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు నిజమేనంటూ నివేదికను సమర్పించింది. ఆయనను అభిశంసించవచ్చని పేర్కొన్నది. ఆ నివేదిక ప్రకారమే.. ఈనెల 9న సంజీవ్ ఖన్నా.. జస్టిస్ యశ్వంత్‌వర్మను అభిశంసించి.. పదవి నుంచి తొలగించాలన్న సిఫారసును భారత రాష్ట్రపతి, ప్రధానులకు సిఫారసు చేశారు. అభిశంసన మార్గదర్శకాల ప్రకారం.. లోక్‌సభ, రాజ్యసభల్లో ఈ ప్రతిపాదనను పెడతారు. ఈ తీర్మానం ముందుకు సాగాలంటే 50 మంది రాజ్యసభ సభ్యులు, 100 మంది లోక్‌సభ సభ్యులు మద్దతు ఇవ్వాల్సి ఉంటుంది. ఇది ఆమోదం పొందాలంటే.. ఉభయ సభలలో మూడింటా రెండు వంతుల మెజారిటీ తప్పనిసరి. ఇందుకు అనేక పార్టీల సపోర్ట్ ఉండాల్సిన అవసరం ఏర్పడింది. ఒకవేళ పార్లమెంటులో ఈ అభిశంసన తీర్మానం వచ్చి.. ఆమోదం పొందితే.. జస్టిస్ వర్మ తన పదవికి దూరమవుతారు. అదే జరిగితే.. ఇలా అభిశంసన ద్వారా వేటుకు గురయిన మొదటి న్యాయమూర్తి ఆయనే కావచ్చని తెలుస్తున్నది. కాలిన నోట్ల కట్టలు లభించిన వ్యవహారంలో జస్టిస్ వర్మ.. ఆ తర్వాత అలహాబాద్ హైకోర్టుకు బదిలీ అయిన విషయం విదితమే. ఆయన బదిలీని ఆ సమయంలో అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకించింది. అయితే.. జస్టిస్ వర్మకు ఎలాంటి జ్యుడిషియల్ డ్యూటీలూ కేటాయించలేదు.



# పాకిస్థాన్ కోలుకోవడానికి కనీసం నాలుగైదేళ్లు పడుతుంది

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

ఆపరేషన్ సిందూర్ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా తొలిసారిగా ఈరోజు జమ్మూకశ్మీర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత బలగాల ధైర్యసాహసాలను కొనియాడారు. "ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిగా, పాకిస్థాన్ సైన్యం మన సరిహద్దుల్లోని పౌరులపై దాడులకు తెగబడింది. అయితే, మన బీఎస్ఎఫ్ దళాలు ఈ దాడులను అత్యంత సమర్థవంతంగా తిప్పికొట్టాయి" అని తెలిపారు. ఈ క్రమంలో పాకిస్థాన్‌కు చెందిన సుమారు 118 పోస్టులను మన బలగాలు నాశనం చేశాయని ఆయన వెల్లడించారు. "శత్రువుల సమాచార, నిఘా వ్యవస్థలను మనవాళ్లు ఒక్కొక్కటిగా కూల్చివేశారు. ఈ నష్టం నుంచి కోలుకోవడానికి పాకిస్థాన్‌కు కనీసం నాలుగైదేళ్లు పడుతుంది" అని అమిత్ షా పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ అందించిన సమాచారం ప్రకారం, పాకిస్థాన్ సైనిక సమాచార, నిఘా వ్యవస్థలకు ఊహించని స్థాయిలో నష్టం వాటిల్లిందని అమిత్ షా తెలిపారు. కొంతకాలం పాటు పూర్తిస్థాయి సమాచార ఆధారిత యుద్ధం చేసే స్థితిలో పాకిస్థాన్ లేదని ఆయన అన్నారు. బీఎస్ఎఫ్ దళాల అప్రమత్తత, స్పష్టమైన వ్యూహరచన, వాటిని విజయవంతంగా అమలు చేసిన తీరును హోంమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. భారత సరిహద్దుల్లో ఎలాంటి దాడి జరిగినా, ఆ భారాన్ని మొట్టమొదట మోసేది బీఎస్ఎఫ్ జవాన్లేనని ఆయన గుర్తుచేశారు. జమ్మూకశ్మీర్‌లో తన రెండు రోజుల పర్యటనలో భాగంగా, ఇటీవల పాకిస్థాన్ జరిపిన దాడుల్లో నష్టపోయిన కుటుంబాలను అమిత్ షా పరామర్శించారు.

# ట్రక్కు నుంచి 4 టన్నుల పేలుడు పదార్థాలను దోపిడీ చేసిన మావోయిస్టులు

**వేద న్యూస్, డెస్క్:**

ఒడిశా లోని సుందర్‌గఢ్ జిల్లాలో ఒక ట్రక్కు నుంచి సుమారు నాలుగు టన్నుల పేలుడు పదార్థాలను సాయుధ మావోయిస్టులు దోచుకొన్న సంఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) బృందం గురువారం దర్యాప్తు ప్రారంభించింది. సుందర్‌గఢ్ జిల్లా లోని బంకో రాతిక్వారీ వద్దకు మంగళవారం 200 ప్యాకెట్ల జిలాటిన్ పేలుడు పదార్థం రవాణా అవుతుండగా మావోయిస్టులు అడ్డుకుని వాటిని దోపిడీ చేశారు. ఝార?ండ్ లోని పశ్చిమ సింగ్భమ్ జిల్లా లోని సరండ అటవీ ప్రాంతానికి అతి చేరువగా ఉన్న ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. ఇది మావోయిస్టుల ప్రాంతం. మావోయిస్టులు తుపాకీ చూపించి డ్రైవర్‌ను బెదిరించి సమీపాన ఉన్న అటవీ ప్రాంతానికి తీసుకుపోయారు. అక్కడ నాలుగు టన్నుల పేలుడు పదార్థాలను దోపిడీ చేశారు. గాలింపు చర్యల్లో ట్రక్కు దొరికినప్పటికీ, అందులో పేలుడు పదార్థాలు మాత్రం లేవు. హిందీ మాట్లాడే మావోయిస్టులు తనపై జాలితో విడిచిపెట్టారని డ్రైవర్ చెప్పాడు. ఎన్ఐఎకు చెందిన సీనియర్ అధికారులు డిఐజి, ఎస్పి, అడిషనల్ ఎస్పి, రూర్కెలాను సందర్శించారు. వీరికి ఒడిశా పోలీసులు సహాయం అందించారు. పొరుగున ఉన్న ఝార?ండ్ నుంచి సుందర్‌గఢ్ లోకి మావోయిస్టులు ప్రవేశించి ఉంటారని డిఐజి బ్రిజేష్ రాయ్ చెప్పారు.

# అంకిత భండారి కేసులో కీలక తీర్పు

**వేద న్యూస్, డెస్క్:**

సుమారు మూడేళ్ల క్రితం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 19 ఏళ్ల రిసెప్షనిస్టు అంకిత భండారి హత్య కేసులో ఉత్తరాఖండ్ స్థానిక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. రిసార్ట్ యజమాని పుల్‌కిత్ ఆర్య, అతనికి సహకరించిన ఇద్దరు ఉద్యోగులు సౌరభ్ భాస్కర్, అంకిత్ గుప్తాలను దోషులుగా నిర్ధారించింది. వీరికి జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. ఉత్తరాఖండ్ పౌరీ జిల్లాలోని ఒక పేద కుటుంబానికి చెందిన అంకిత భండారి కొవిడ్ కారణంగా ఆర్థిక సమస్యలతో హోటల్ మేనేజిమెంట్ కోర్సును మధ్యలోనే నిలిపేసింది. ఆమె తండ్రి ఒక గార్డుగా పనిచేసేవాడు. ఈ క్రమంలో పుష్ప అనే ఫ్రెండ్ ద్వారా రిషికేష్‌లోని వంతారా రిసార్ట్‌లో ఆమెకు రిసెప్షనిస్టుగా ఉద్యోగం వచ్చింది. 2022 సెప్టెంబర్ 18వ తేదీన ఆమె కనిపించకుండా పోవడం, నాలుగు రోజుల తర్వాత మృతదేహం ఒక కాలువలో దొరకడం సంచలమైంది. దీనిపై జనాగ్రహం వ్యక్తమైంది. పుల్‌కిత్ ఆర్క్ తండ్రి వినోద్ ఆర్య బీజేపీ మాజీ నేత కావడంతో కేసు నుంచి అతన్ని తప్పించే ప్రయత్నం జరుగుతోందంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో వినోద్ ఆర్యను పార్టీ నుంచి బీజేపీ తొలగించింది. కేసు విచారణను సిట్‌కు అప్పగించారు. ఈ క్రమంలో పుల్‌కిత్ ఆర్య, సౌరభ్ భాస్కర్, అంకిత్ గుప్తాలను అరెస్టు చేశారు. విచారణలో రిసార్ట్‌కు వచ్చే అతిథులకు అదనపు సేవలు అందించాలని అంకితపై పుల్‌కిత్ ఒత్తిడి తెచ్చాడని, ఆమె అంగీకరించకపోవడంతో జరిగిన పెనుగులాటలో అతను, అతని సహోద్యోగులు కలిసి ఆమెను కాలువలోకి తోసేశారని తేలింది. వేధింపులు, హత్య, సాక్ష్యాలను ధ్వంసం చేయడం, ఇమ్మోరల్ ట్రాఫికింగ్ సహా పలు సెక్షన్ల కింద వీరిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు 2023 జనవరి 30న తొలిసారి విచారణకు రాగా, మొత్తం 97 మందిలో 47 మంది సాక్ష్యులను సిట్ విచారించింది. 500 పేజీల ఛార్జిషీటును కోర్టుకు సమర్పించింది. ఎట్టకేలకు రెండేళ్ల విచారణ అనంతరం శుక్రవారం నాడు పుల్‌కిత్ ఆర్య, సౌరభ్ భాస్కర్, అంకిత్ గుప్తాలను అదనపు సెషన్స్ జడ్జి రీనా నెగి దోషులుగా ప్రకటించారు. ఈ ముగ్గురికీ జీవిత ఖైదు విధించారు. కాగా, నిందితులకు ఉరిశిక్ష విధించాలని అంకిత తల్లి సోని దేవి మీడియాతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు.

వేద న్యూస్

శనివారం మే 31, 2025



## ఇబ్బందులు కలగకుండా పంపిణీ చేయాలి

- వేములపల్లి తహసిల్దార్ హేమలత

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

రేషన్ లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా రేషన్ డీలర్లు పంపిణీ చేయాలని వేములపల్లి తహసిల్దార్ హేమలత కోరారు. శుక్రవారం తహసిల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. డీలర్లు లబ్ధిదారులకు సకాలంలో అందుబాటులో ఉండి పంపిణీ చేయాలని సూచించారు. మూడు నెలల బియ్యం పంపిణీకి ప్రతి గ్రామంలో డీలర్లు టామ్ టామ్ నిర్వహించాలన్నారు. ప్రతి రేషన్ షాప్ ముందు ధరల పట్టిక ఉండాలని డీలర్లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ కోటేశ్వరి, ఆర్ ఐ లు మహేందర్ రెడ్డి, స్పందన రెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షులు కందిమల్ల సుధాకర్ రెడ్డి, పాండురంగయ్య, కృష్ణమూర్తి నాగేశ్వరరావు, గురవయ్య,సబ్బు సతీష్ రెడ్డి, లచ్చయ్య, రవి,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీల రాష్ట్ర స్థాయి సమావేశం జయప్రదం చేయండి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలు, దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన, భవిష్యత్తు బీసీ ఉద్యమ కార్యాచరణపై చర్చించేందుకు జూన్ 1న హైదరాబాద్ లోని బంజారాహిల్స్ లో ఉన్న కళింగ భవన్ లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.ఆదివారం నాడు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి బీసీ సంక్షేమ సంఘంతో పాటు అనుబంధ సంఘాల ప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి నేతలు హాజరు కావలసిందిగా ఆయన కోరారు.అలాగే రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు,స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ అమలు, త్వరలో దేశవ్యాప్తంగా జరిగే జనగణనలో సమగ్ర కులగణన అమలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను ఈ సమావేశంలో ప్రకటించనున్నట్లు లింగంగౌడ్ తెలిపారు.




## ఘనంగా సీతారామచంద్రస్వామి మాస కళ్యాణం

**వేద న్యూస్,సూర్యాపేట ప్రతినిధి:**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బొడ్రాయి బజార్‌లో గల శ్రీ వేదాంత భజన మందిరంలో శుక్రవారం శ్రీ సీతారామచంద్రస్వామి జన్మ నక్షత్రం(పునర్వసు) సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పంచామృత అభిషేకం, మాస కళ్యాణంను మందిర ప్రధాన అర్చకులు దరూరి సింగరాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వేదాంత భజన మందిరం అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వరరావు, కోశాధికారి సోమ అశోక్,అర్చకులు ధరూరి రాఘవాచార్యులు, గోమటం ఫణి కుమారాచార్యులు, సోమ సుమన్, ఓరుగంటి చంద్రశేఖర్, శీల శంకర్, వాసా కృష్ణ, శ్రీనివాస్, చిత్తలూరి శ్రీధర్, ఈగ వెంకటేశ్వర్లు, శీల రేణుక, ధరూరి గోదాదేవి, తిరుమల అశ్విని, భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి కళ్యాణంలో పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ షాపు తనిఖీ చేసిన వ్యవసాయ అధికారి

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండలంలోని శాయంపేట గ్రామంలో గల సాయి ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపును మండల వ్యవసాయ అధికారి గంగజమున తనిఖీ చేయడం జరిగింది. లైసెన్స్, పలు రికార్డులను పరిశీలించి నకిలీ విత్తనాలు, లూజుగా అమ్మే విత్తనాలను వ్యాపారం చేయకూడదని సూచించడం జరిగింది. రిజిస్టర్లు బిల్లు బుక్కులను రైతు వారిగా విక్రయాల వివరాలతో కూడి నటువంటి రిజిస్టర్లను తప్పనిసరిగా ఉండాలని సూచించడం జరిగింది. రైతులు అధికృత డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి,బిల్లు రసీదులను కచ్చితంగా తీసుకోవాలి, రసీదుల మీద షాపు యజమాని, రైతు యొక్క సంతకం తప్పనిసరిగా ఉండాల న్నారు. ఈ యొక్క బిల్లును రైతులు పంట కాలం అయిపోయే వరకు కూడా భద్రపరుచుకోవాలని సూచించడం జరిగింది. రైతులు తమకు నచ్చిన రకాన్ని ఎంచుకొని సాగుచేసుకొనవచ్చు, మంచి యాజమాన్య పద్ధతులను పాటించినట్లయితే అధిక దిగుబడులు కూడా సాధించవచ్చు అని తెలిపారు.

## అడిషనల్ డీసీపీగా భాధ్యతలు చేపట్టిన రాయల ప్రభాకర్ రావు



**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ లా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ విభాగం అదనపు డీసీపీగా రాయల ప్రభాకర్ రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు.ఆసిఫాబాద్ జిల్లా అడిషనల్ ఎస్పీగా పనిచేస్తూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బదిలీపై వచ్చిన ప్రభాకర్ రావు గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఏసీపీగా పనిచేయడంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ హెూదాల్లో సమర్థవంతంగా పనిచేశారు.

# సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్లో బిఎల్ఆర్ బ్రదర్స్, ఎన్.వి.ఆర్ యూత్ వారి ఆధ్వర్యంలో గత నెల రోజుల నుండి నిర్వహించబడుతున్నటు వంటి సమ్మర్ క్యాంప్ శుక్రవారంతో ముగియబడింది. ముగింపు కార్యక్రమానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు సమ్మర్ క్యాంప్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్,డ్రెస్ కిట్ మరియు అల్పాహారం అందించారు. చిన్నారుల క్రీడాకారులతో సరదాగా కాసేపు వారు కూడా వాలీబాల్ గేమ్‌ను ఆడి శిక్షణ తీసుకున్నటువంటి క్రీడాకారులని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటితరం పిల్లలు మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ కు అలవాటు పడి శారీరిక ఆరోగ్యం మీద దృష్టి పెట్టడం లేదన్నారు. ఇలాంటి సమ్మర్ క్యాంపులను ఉపయోగించుకొని భవిష్యత్ తరాల వారు శారీరక ఫిట్నెస్ సాధించి వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. తాను కూడా స్వయంగా ఈ గ్రౌండ్‌లో క్రమం తప్పకుండా వాకింగ్ చేసే వాడినని గుర్తు చేసుకున్నారు.అలాగే చిన్నారి క్రీడాకారులు చదువుతోపాటు క్రీడలను కూడా రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎన్విఆర్ ఫౌండేషన్ చైర్మన్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఈ గ్రౌండ్‌ని వారి ఆధ్వర్యంలో ఎంత అభివృద్ధి చేశారో వివరించారు. అలాగే తాను గ్రౌండ్ లోని క్రీడాకారులకు మరియు వాకర్స్ కు అందిస్తున్నటువంటి సేవలను గుర్తు చేసుకున్నారు.ఇక ముందు కూడా తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటివి ఎన్నో క్యాంపులు మరియు క్రీడాకారులకు కావలసినటువంటి సదుపాయాలను తప్పకుండా కల్పిస్తానన్నారు. అలాగే ఈ గ్రౌండ్ లో గత 15 ఏళ్లుగా ప్రతి సంవత్సరం దసరా సెలవుల్లో వాలీబాల్ క్రీడాకారులను ప్రోత్సహించడానికి గ్రౌండ్లోని వాలీబాల్ సీనియర్ క్రీడాకారుల మద్దతుతో అత్యంత అట్టహాసంగా భారీ ప్రైజ్ మనీ మరియు ఇతర సదుపాయాలతో టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.ఈ గ్రౌండ్ నుండి పూర్వం ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి మరియు జాతీయస్థాయిలో జరిగినటువంటి క్రీడలలో రాణించి ఈ గ్రౌండ్ ని డెవలప్ చేసినటువంటి మాలాంటి వారికి మంచి పేరు తీసుకొచ్చారు అని చెప్పుకొచ్చారు.వారే నేడు సమ్మర్ క్యాంపులు మరియు టోర్నమెంట్లు నిర్వహించి క్రీడాకారులను జాతీయస్థాయిలో రాణించేలా శిక్షణను ఇస్తూ తీవ్రంగా శ్రమిస్తున్నారని వారిని ప్రశంసించారు. అనంతరం శిక్షణ ఇచ్చినటువంటి కోచ్‌లను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్.వి.ఆర్ ఫౌండేషన్ ముఖ్యసభ్యులు ఆడోత్ అశోక్ నాయక్,డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు,తాజా మాజీ కౌన్సిలర్లు దేశీ రెడ్డి శేఖర్ రెడ్డి ,రుణాల్ రెడ్డి, వెంకన్న,కొమ్ము శ్రీను,25వ వార్డు ఇన్చార్జి జానకి రామ్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి నాగునాయక్,బూడిద సైదులు,మహేందర్ రెడ్డి,ఎంఈఓ బాలాజీ నాయక్,వాకర్స్ అధ్యక్షులు గుడపూరిలక్ష్మణ్,శరత్,కోచ్ లు నాగరాజు,అశోక్ చారి,మనోహర్,లక్ష్మణ్ లతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం పథకాలకు రైతు గుర్తింపు కార్డు

- రైతులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- మండల వ్యవసాయ అధికారి గంగజమున

**వేద న్యూస్,శాయంపేట:**



శాయంపేట మండలంలోని తహారాపూర్ గ్రామంలో మండల వ్యవసాయ అధికారి గంగాజమున రైతులకు రైతు గుర్తింపు కార్డు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఆధార్ తో దేశంలోని ప్రతి పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకు 11 నెంబర్లతో విశిష్ట సంఖ్య (యూనికోడ్) ని కేటాయించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టును చేపట్టడం జరిగింది అన్నారు.భూమి ఉన్న ప్రతి రైతు తనకు ఉన్న భూములకు సంబంధించిన వివరములతో కూడిన సమాచారంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరములను రైతు యొక్క ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయడం ద్వారా ఈ ఫార్మర్ ఐడిని కేటాయించడం జరుగుతుంది.ఫార్మర్ రిజిస్ట్రేషన్ లో నమోదు ఏ రకమైన చట్టబద్ధ యాజమాన్య హక్కును కల్పించదు. కేవలం రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ యాజమాన్య వివరాలను ప్రామాణికంగా తీసుకొని రైతులకు ఫార్మర్ ఐడి కేటాయించడం జరుగుతుంది అన్నారు.కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. పిఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడత లబ్ధి పొందుటకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది అని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ సంబంధిచిన పథకాలు అయిన రైతు భరోసా రుణమాఫీ తదితర రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీకి ఏ రకమైన సంబంధం లేదు అన్నారు. రైతు విశిష్ట సంఖ్యను (ఫార్మర్ ఐడి) పొందుటకు మీ ఆధార్, భూ యాజమాన్య పాస్ పుస్తకము, ఆధార్ కు లింక్ చేయబడిన మొబైల్ నెంబరు తీసుకొని సమీపంలోని వ్యవసాయ అధికారి , వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఫార్మర్ ఐడీకి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ రాకేష్, రైతులు పాల్గొన్నారు

# మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి మాదిగలకు కేటాయించాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



దామరచర్ల మండల కేంద్రంలో శుక్రవారం మాదిగ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ స్థాపించిన దగ్గర నుండి దామరచర్ల మండలంలో ఇంతవరకు ఎస్సీ మాదిగలు మండల అధ్యక్షుడు పదవి చేసినట్టు దాఖలు లేవు అని అన్నారు.దామరచర్ల మండలం ఏర్పాటు నుండి అనేకమంది మాదిగలు పార్టీ నమ్ముకొని పార్టీ జెండా మోసారు,కానీ నాటి నుండి జనరల్ స్థానంలో 15 సంవత్సరాలు రెడ్డిలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పదవి చేశారు.అలాగే ఎస్టీలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి చేశారు.అలాగే బీసీలు రెండుసార్లుగా మండల అధ్యక్షులు పదవిని చేస్తూ వస్తున్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ కమిటీలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో ఎస్సీ మాదిగలకు కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవిని కచ్చితంగా కేటాయించాలని డిమాండ్ చేశారు.లేదంటే దామరచర్ల మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎస్సీ మాదిగలను సమీకరించి ముకుమ్మడిగా రాజీనామా చేయడానికి కూడా సిద్ధం చేయక తప్పదని హెచ్చరించారు. ప్రస్తుతం జనరల్ స్థానంలో ఎమ్మెల్యే ఉన్నారు.ఎస్టీలలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా, ఎస్టీల క్యాటగిరిలో ఎమ్మెల్సీ ఉన్నారు.కావున ఏ పరంగా చూసినా దామరచర్ల మండల అధ్యక్షుడు పదవి ఎస్సీ మాదిగల హక్కు అనే నేపథ్యంలో, ఖచ్చితంగా ఎస్సీ మాదిగలకు కేటాయించాలని మాదిగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాదిగ సంఘాల నాయకులు కొమ్ము దాసు,ఆకారపు గోపాల్,సందాల సదానందం, అల్లంపల్లి నాగేశ్వరావు,అలంపల్లి నగేష్,ఆలంపల్లి వసంత కుమార్, మహంకాళి రాజేష్,సందాల శంబయ్య,కోటఈశ్వర్,పరంగి సైదులు,పోలేపల్లి ఉదయ్, వట్టేపు ప్రేమ్ కుమార్,కొత్తపల్లి శ్రీను,పోకల రవికుమార్, కొమ్ము రాజేష్,గద్దల కాశయ్యతదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ శ్రీకాంత్

**వేద న్యూస్, శేరిలింగంపల్లి :**



మియాపూర్ డివిజన్ పరిధిలోని నాగార్జున ఎనక్లేవ్ కాలనీలోనీ పార్క్ లో ఎశియామ్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి ఓపెన్ జిమ్ ను మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ నాగార్జున ఎనక్లేవ్ కాలనీలోనీ పార్కులో ఎశియామ్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి ఓపెన్ జిమ్ ను ప్రారంభించడం జరిగినది అని, ఇలాంటి సదుపాయాలను ప్రైవేట్ సంస్థలు కాలనీలా అభివృద్ధి కొరకై ముందుకు రావడం మంచి విషయం అని అన్నారు. ప్రజలు ఇలాంటి సదుపాయాలను ఉపయోగించుకోవాలని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. నాగార్జున ఎనక్లేవ్ కాలనీలోనీ పార్కులో ఈ యొక్క సదుపాయాలను కల్పించిన ఎశియామ్ సాఫ్ట్‌వేర్ సంస్థ వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎశియామ్ సాఫ్ట్‌వేర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పద్మనాభయ్య, హనుమరెడ్డి, కాలనీ వాసులు, రామకృష్ణ వర్మ, రమణ రెడ్డి, అశోక్ రెడ్డి, వెంకటేశ్వరావు,శివ, లక్ష్మీ, గోపాల కృష్ణ,సురపురాజు, సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

**మొదటి పేజీ తరువాయి**

ధరావత్ ధారాసింగ్, బానోత్ బాలు నాయక్, నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జాన్ రెడ్డి, సూర్యాపేట జిల్లా మాజీ అధ్యక్షులు బొల్లికొండ కోటయ్య, యాదాద్రి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకటయ్య, జిల్లా మాజీ గౌరవ అధ్యక్షులు కందుకూరి శివశంకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గోదేశి దయాకర్, దండుదుల ఎల్లయ్య, పిన్నమరెడ్డి నరేందర్ రెడ్డి, గుండేటి లక్ష్మణరావు, గుణగంటి శ్రీనివాస్, కైరంకొండ రమేష్, ఎల్లు వెంకటరెడ్డి, గోదల చంద్రారెడ్డి, ప్రతాప్ కుమార్, కాజా ఖలీల్ అహ్మద్ ఖాన్, సత్యనారాయణ రెడ్డి, గిరి ప్రసాద్, మామిడి వెంకటయ్య, మాజీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మేకల రాజశేఖర్, దొంగర మహేష్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు అల్లాడి సత్యనారాయణ, సూర్యాపేట మండల పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వల్లెం శంకర్ ప్రసాద్, పటేల్ శ్రీమాన్ రెడ్డి, మారగాని వెంకటేశ్వర్లు, వల్లెం శేఖర్ చివేముల, ఆత్మకూర్ పెన్ పహాడ్, మోతే, నూతనకల్, మద్దిరాల, జాజిరెడ్డిగూడెం, నాగారం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ బషీర్, పొదిల రవీందర్, తంగెళ్ల వాసుదేవ రెడ్డి, నంద్యాల చౌదరి రెడ్డి, సంద్యాల వినోద్, నల్ల శ్రీనివాస్, ఊట్కూరు వెంకటరెడ్డి, మడిపల్లి కిరణ్ కుమార్, ఉప్పు నాగయ్య, కామల్ల మురళీధర్, ఉల్లెందుల సైదులు, జలగం పురుషోత్తం, కాసం చక్రధర్ పాల్గొన్నారు.

## శాతవాహన యూనివర్సిటీలో చరిత్ర, టూరిజం డిపార్ట్మెంట్ ఏర్పాటుకు వినతి

**వేద న్యూస్, కరీంనగర్ :**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవి కుమార్ ని చరిత్ర పరిరక్షణ సమితి, రాష్ట్ర కమిటీ శుక్రవారం రోజున కలిసి యూనివర్సిటీలో చరిత్ర మరియు టూరిజం డిపార్ట్మెంట్ ను ఏర్పాటు చేయాలని, అలాగే శాతవాహన యూనివర్సిటీ ప్రాంగణంలో శాతవాహన వంశ మూలపురుషుడైన శాతవాహనుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం యూనివర్సిటీ ప్రాంగణంలో శాతావానుడి విగ్రహం తప్పకుండ పెడుతాము అని,వచ్చే విద్యా సంవత్సరం నుండి చరిత్ర మరియు టూరిజం డిపార్ట్మెంట్ పెట్టుటకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు చరిత్ర పరిరక్షణ సమితి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేరళ సెంట్రల్ యూనివర్సిటీ టూరిజం ప్రొఫెసర్ గుజ్జెటి తిరుపతి, చరిత్ర చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పోతరవేణి తిరుపతి, వ్యవస్థాపకులు డాక్టర్ సందవేణి తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, జి. రాజేందర్, టి. పుష్పలత, టి. రమేష్, డా. టి.శ్రీనివాస్, డా.ఏ. కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.




Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073